దానవాయిపేట (రాజమహేంద్రవరం): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి న్యాయవాదుల క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయవాదుల రాష్ట్రస్థాయి పోటీలకు రాజమహేంద్రవరం వేదిక కావడం అభినందనీయమన్నారు. క్రీడలతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో షటిల్, క్యారమ్స్, చదరంగ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఆరోస్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి కార్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రమేష్, కోశాధికారి కర్రి హనుమంతరావు, ఉపాధ్యక్షులు సర్వప్రసాద్, డీవీపీ ప్రసాద్, ధర్మారాజు, వెంకటేశ్వరరావు, పద్మిని, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



బంగారు కిరీటాన్ని ఈవోకు అందిస్తున్న దాత

లక్ష్మీనర్సింహస్వామికి బంగారు కిరీటం



అన్నవరం: అన్నవరం దత్తత దేవాలయం కోరుకొండ లక్ష్మీ నర్సింహస్వామికి ఓ దాత బంగారు కిరీటాన్ని శనివారం అందజేశారు. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన దాత బి.ఆదినారాయణ మూర్తి సుమారు 40 గ్రాములతో ఈ కిరీటాన్ని తయారు చేయించారు. సుమారు రూ.2.70 లక్షల వ్యయంతో చేయించిన కిరీటాన్ని అన్నవరం ఈవో కె.రామచంద్రమోహన్‌కు అందజేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూపాయల్లో)
కొత్తకొబ్బరి కండె (వెయ్యింటికి)	12,000
పాతరకం గండేరా	17,500
గటగట	15,500
కొత్తరకం గండేరా	16,500
గటగట	14,500
నీళ్ల కాయ (వెయ్యి)	16,000-17,000
పచ్చ కాయ	15,000-17,500
కొబ్బరి నూనె 15 కిలోలు	3,750
కిలో	260

ఎన్‌ఈసీసీ చికెన్ ధర

పారాబాయిల	121-00
లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5.35 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908



ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024–2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది?
జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)
జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.)
జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM'ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?
జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024
తెలుగు కంటెంట్

పదోతరగతి
తెలుగు
ప్రత్యక్ష దైవాలు



తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. **తల్లిదండ్రులు:** పోతమ్మ, సూరనలు. **జననం:** పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). **ఉద్యోగం:** అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. **రచనలు:** రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం. **బిరుదులు:** శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. **రచనా శైలి:** సూక్తి వైచిత్రికి పేరెన్నిక గన్నది. ✦ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైన మరికొన్ని..
8 మార్కుల ప్రశ్నలు
1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.
జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఏపీపీ)

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

> దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండొనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

1) తరిగిపోయేవి: వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) తరగనివి: ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98% ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

> దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

పీట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

లడ్డూను అపవిత్రం చేశారు
జగన్‌కు తగిన శిక్ష పడాలి: గోరంట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

టి.నగర్, న్యూస్‌టుడే: జగన్ హయాంలో తిరుమల లడ్డూను అపవిత్రం చేశారని, అందుకు ఆయనకు తగిన శిక్ష పడాలని రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార దాహంతో విర్రవీగి ఇష్టానుసారంగా తప్పులు చేశాడన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిపేలా వ్యవహరించారన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంటు విభాగం సైతం నెయ్యిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నివేదిక ఇచ్చిందన్నారు. తిరుమలకు ఎవరైనా వెళ్లొచ్చని, అన్యమతస్తులు వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. జగన్ క్రైస్తవ మతం తీసుకొన్న విషయం అందరికీ తెలుసన్నారు. బ్రహ్మోత్సవాలకు భార్యను తీసుకెళ్లలేదన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారం పాటించకుండా ఒక్కడివే ఎలా వెళ్తావ్ అన్నారు. రామతీర్థంలో రాముడి విగ్రహం తల నరికేస్తే ప్రతిపక్షాలు వెళ్లకుండా అడ్డుకొన్నాడన్నారు. మతం ముసుగులో ఓట్ల కోసం ప్రజల్ని మభ్యపెట్టడానికి హిందూ ధర్మాన్ని పాటించారన్నారు. డబ్బులు లేవనే సాకుతో రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో నిత్యహారతులు ఆపేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో డిక్లరేషన్ ఇవ్వకుండా వెళ్లి, తిరుమల ఆస్తులను అమ్ముకున్నారని ఆరోపించారు. పవన్‌కల్యాణ్ బాప్టిజం తీసుకోలేదని, దీనిపై బోగస్ ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబుపై చవాకులు పేలితే తరిమి కొడతామన్నారు. లడ్డూ విషయం రాష్ట్ర సమస్య కాబట్లే సిట్ వేశామని, అంతర్రాష్ట్ర సమస్య అయితే సీబీఐకి అప్పగించేవారమన్నారు. గతంలోనూ జగన్ ప్రజలను అబద్ధాలతో మోసం చేశారన్నారు. కోడికత్తి డ్రామా, రాజధాని అమరావతిలోనే నిర్మాస్తామని, బాబాయ్ హత్య ఇవన్నీ డ్రామాలాడారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

'ఒకే దేశం - ఒకే ఎన్నిక' సాధ్యం కాదు: వనజ



ప్రసంగిస్తున్న సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తీసుకొస్తున్న ఒకే దేశం- ఒకే ఎన్నిక విధానం ఆచరణ సాధ్యం కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద జరిగిన సీపీఐ కూరగాయల సెక్షన్ శాఖ జట్ల కార్మికుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భిన్న కులమతాలు, విభిన్న సంస్కృతులు, బహుళ ప్రాంతీయ రాజకీయ పార్టీలతో కూడిన దేశం మనదని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం ఉంటుందని, ఒకే దేశం- ఒకే విధానం ఆచరణ సాధ్యంకాదని అన్నారు. జమిలీ ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. ఇటీవల నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి పెట్టాలన్నారు. డిసెంబరు 26 నుంచి ప్రారంభమయ్యే సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి రమణ, నగర కార్యదర్శి కొండలరావు, కూరగాయల సెక్షన్ నాయకులు, జట్ల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.



RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



> **రవాణా సౌకర్యం..** రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.



మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

సమాజాన్ని చైతన్యవంతం చేసేదే సాహిత్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: సమాజాన్ని చైతన్యవంతం చేసేదే సాహిత్యమని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం - స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు జాతీయ సదస్సు శనివారం నన్నయలో ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ వేద భూమిలో నివసించిన మన పూర్వీకులు ఎటువంటి సాంకేతికత లేని కాలంలో విశ్వాన్ని గూర్చిన అనేక విషయాలను ప్రస్తావించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ విభిన్న దృక్పథాలతో 40 గ్రంథాలు రాసిన విశ్వస్ఫూర్తి వారి సాహిత్యం అభినందనీయమన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ సీఈ ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి రచనలలో ఆధునికతను, ఆధ్యాత్మికతను జోడించిన సాహిత్య రచనలు కనిపిస్తున్నాయన్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతకు సాక్ష్యంగా జాతీయ సదస్సులు నిలుస్తాయన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రెక్టర్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ శాస్త్రీయమైన పద్ధతిలో గురోపదేశం గావించే వ్యక్తి విశ్వస్ఫూర్తి అన్నారు. కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు జాతీయ సదస్సుకు 350 మంది దక్షిణాది రాష్ట్రాల నుంచి హాజరయ్యారన్నారు. 79 పరిశోధనా పత్రాలతో సదస్సు వ్యాసావళి అనే పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించామన్నారు. గురు విశ్వస్ఫూర్తి రచనలు- ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం పేరుతో ప్రచురించిన పరిశోధనా పత్రాల గ్రంథాన్ని ఆవిష్కరించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



దానవాయిపేట (రాజమహేంద్రవరం): జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యను జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న న్యాయమూర్తిని కలసి పూలమొక్క అందజేశారు.

బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు మానుకోవాలి
మాజీ ఎంపీ హర్షకుమార్

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి వీడియో విడుదల చేశారు. గుడికి దారి విషయంలో అంబేడ్కర్ బ్యానర్‌ను తొలగించాల్సిన అవసరం లేదన్నారు. దళితులను ఉద్దేశించి ఆయన మాటలు సరికాదన్నారు. వారంతా చర్చిలకు వెళ్తున్నారని, తనపై ఎలా కేసులు పెడతారని ప్రశ్నిస్తున్నారన్నారు. మత స్వాతంత్ర్యం కోసమే దళితులు పోరాడుతున్నారన్నారు. రంగనాథ్ మిశ్రా కమిటీ నివేదిక ప్రకారం దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు కూడా దళితులుగానే పరిగణనలోకి వస్తారన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో ఈ అంశంపై తీర్మానం చేశారన్నారు. దళితుల్లో 80 శాతం క్రైస్తవులు ఉన్నారన్నారు. తప్పులు కప్పి పుచ్చేలా మాట్లాడటం సరికాదన్నారు. గరకపర్రులో గత రెండు ప్రభుత్వాల్లో విగ్రహ సమస్య తీర్చలేకపోయారన్నారు. రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. లేదంటే చలో ఏలూరు పాదుకు పిలుపునిస్తామన్నారు.

ముగ్గురు ఇంటి దొంగల అరెస్టు
రూ.24.99 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మసీదుసెంటర్ (కాకినాడ): ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టుచేసి వారి నుంచి రూ.24.99 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. 277 గ్రాముల బంగారం, 6 కేజీల వెండి ఆభరణాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రదర్శించి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాదిలో జిల్లాలోని ఇంద్రపాలెం, పెదపూడి, తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు, రాజానగరం పోలీసుస్టేషన్ల పరిధిలో నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఆయా కేసుల్లో కాకినాడ రామకృష్ణారావుపేటలో ఉంటున్న ఏలూరు జిల్లా వంగాయగూడెం గాంధీకాలనీకి చెందిన ఇసుకలేటి మోజెస్ (30) ఏ1, రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కి చెందిన ఇసుకలేటి గాంధీ (41) ఏ2, రాజేంద్రనగర్‌కి చెందిన తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ (32) ఏ3 ప్రధాన నిందితులుగా ఉన్నారని చెప్పారు. వీరిని శనివారం రామకృష్ణారావుపేటలోని మోజెస్ ఇంటిలో అరెస్టుచేసి చోరీ సొత్తుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితులు, పాత నేరస్థులైన మోజెస్, గాంధీ వరసకు అన్నదమ్ములని, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో రాత్రివేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలు చేస్తారని చెప్పారు. సొత్తును గాంధీకి బావ అయిన రామ్‌కుమార్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించి ఆ సొమ్ముతో జల్సాలు చేస్తారని వెల్లడించారు. చోరీ సొత్తు స్వాధీనంలో కృషిచేసిన ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఎస్బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, క్రైం సీఐ వి.కృష్ణ, రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, టూటౌన్ సీఐ ఎం.అప్పలనాయుడు, క్రైం ఎస్సై వినయ్‌ప్రతాప్, సిబ్బంది గోవిందరాజు, పుల్లయ్య, ధనరాజు, చిన్న, వర్మ, సత్యమూర్తి, మౌళి, నాయుడు, మొయిన్, ఐటీకోర్ సిబ్బంది ప్రసాద్, స్వామి తదితరులను ఎస్పీ అభినందించారు.

ఎక్సైజ్ సీఐల బదిలీలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): జిల్లా ఎక్సైజ్ విభాగంలోని పలువురు సీఐలను బదిలీ చేస్తు రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో విడుదల చేసింది. రాజమహేంద్రవరం ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐగా ఉన్న ఎన్.నెక్సాన్‌కు మచిలీపట్నం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ కాగా ఆ స్థానంలో విజయవాడ నుంచి రెడ్డి త్రినాథ్ రానున్నారు. సౌత్ స్టేషన్ సీఐగా ఉన్న పి.హనుశ్రీను రాజమహేంద్రవరం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. ఆ స్థానంలో మైలవరం సీఐ పి.సుబ్బిరెడ్డి నియమితులయ్యారు. కోరుకొండ స్టేషన్‌కు జె.శ్రీనివాస బాలాజీ, కొవ్వూరు స్టేషన్‌కు జి.సత్యనారాయణను, దేవరపల్లి స్టేషన్‌కు బాలశ్రీనివాసరావు, నిడదవోలు స్టేషన్‌కు ఆర్‌జే.సతీష్‌బాబు, రంగంపేట స్టేషన్‌కు డి.సుధ రానున్నారు. రాజమహేంద్రవరం ఏపీఎస్‌బీసీఎల్ విభాగం ఐఎంఎల్ డిపో సీఐగా కదిరి శ్రీధర్‌ను నియమించారు.

రాజమహేంద్రవరం

సర్వేపల్లి సేవలు ప్రశంసనీయం

దేవీచౌక్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పిలాసఫీ విభాగం ఆధ్వర్యంలో శనివారం సర్వేపల్లి రాధాకృష్ణ స్మారక ప్రసంగం నిర్వహించారు. ప్రధాన వక్తగా నన్నయ విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య డాక్టర్ కొట్టె రమేష్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ మూలాలు లేకపోయినా ప్రపంచ యుద్ధ కాలంలో రష్యాకు రాయబారిగా సర్వేపల్లి ప్రపంచ నేతల మన్ననలు పొందారన్నారు. డిక్లమేషన్ కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, పిలాసఫీ విభాగాధిపతి డాక్టర్ కె.సీతామహాలక్ష్మి, అధ్యాపకులు రాజభూషణం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, వీవీఎస్ మహల్, అశోక్, కుమారి, సూర్యప్యాలెస్, స్వామి, అప్సర, రంభ: దేవర. సూర్యమిని, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాటా-36/చిన్నవి-32, వంకాయలు నలుపు-30/గులాబీ-44/తెలుపు-34/దొమ్మేరు-46, బెండ-24, కాకర-34, బీర కాయ-34, పొట్ల-28, దొండ-32, క్యాబేజీ-32/36, బీట్‌రూట్-28, గోరుచిక్కుడు-30, దోస-34, ఆనపకాయ-24/25, చిక్కుడు-48/దేశవాళీ-78, పచ్చిమిర్చి-20, బంగాళదుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-40.

నటరాజుకి నాట్య నీరాజనం





అదిగో అల్లదిగో శ్రీహరివాసము... శ్రీగణనాథం... శ్రీశైల వాసా.. తదితర కీర్తనలకు చిన్నారులు మనోహరంగా నృత్యాభినయం చేశారు. శ్రీకళా నృత్య నికేతన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం తిలక్ కల్యాణ మండపంలో నాట్యాచారిణి పసల బాస్కర కుమారి ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. అన్నమాచార్య, పురందరదాసు, త్యాగరాజస్వామి కీర్తనలకు చేసిన ప్రదర్శన కనువిందు చేసింది. నాట్యాచార్యులు సప్పా యశోదకృష్ణ పర్యవేక్షణలో జరిగింది.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

హృదయం పదిలం



కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామవ కుమారి నిర్వహణలో కళాశాల సైన్స్ అసోసియేషన్ సభ్యులు ప్రపంచ హార్ట్ డే సందర్భంగా గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుండె జబ్బుల నివారణ మార్గాలను వివరిస్తూ నగర వీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.ఎస్.రత్నకుమార్, ఎం.సునీత, బి.టి.సుందర, సీహెచ్.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ఆరోగ్యానికి అడుగేద్దాం



దురలవాట్లకు దూరంగా ఉండటం, సరైన వ్యాయామంతో గుండె సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని ఎస్పీ డి.నరసింహకిశోర్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు, కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తాడితోట కిమ్స్ ఆసుపత్రి నుంచి పుష్కరఘాట్ వరకు కొనసాగింది. గుండె వ్యాధులతో ఏటా సుమారు రెండు కోట్ల మంది మరణిస్తున్నారన్నారు. వైద్యులు, డీఎస్పీ, సీఐ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, దానవాయిపేట

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: స్థానిక పీఅండ్‌టీ కాలనీలో తాగునీటి పైపులైను లీకై పగిలిపోయింది. మరమ్మతుల కోసమని పది రోజుల కింద గొయ్యి తీసి వదిలేశారు. ఇప్పటివరకు కనీసం పైపులైనుకు మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఇబ్బంది పడుతున్నాం.
- సురేష్, స్థానికుడు

సమస్య: స్థానిక పేపరుమిల్లు రోడ్డు శ్రీరామ్‌నగర్‌లో పైపులైను పగిలి నెల రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.
- పద్మావతి, స్థానికురాలు

సమాధానం: తాగునీటి పైపులైన్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.
- చంద్రశేఖర్, వాటర్‌వర్క్స్ డీఈ

సమస్య: స్థానిక తాడితోట తెలుగు పార్కు వద్ద చెత్త పేరుకుపోయినప్పటికీ తొలగించడం లేదు. దీనివల్ల అటుగా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు.
- శ్యామ్, స్థానికుడు

సమాధానం: చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- నిమ్మల, ఎంహెచ్‌వో

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు **83282 39927** **80089 02897**

నూతన ఎక్సైజ్ విధానం అమలుకు సూచనలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): ప్రభుత్వ నూతన ఎక్సైజ్ పాలసీ పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య పేర్కొన్నారు. శనివారం ఆమె రాజమహేంద్రవరం ఎక్సైజ్ సౌత్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. నేరాలు జరిగే ప్రాంతాలు, కేసుల విచారణ వంటి విషయాలను తెలుసుకుని సిబ్బందికి నూతన ఎక్సైజ్ పాలసీపై సూచనలు చేశారు. సౌత్ సీఐ పి.హనుశ్రీ, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై కూటమి ప్రత్యేక శ్రద్ధ

ఏ.వి.ఏ రోడ్డు: ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు దృష్టి పెట్టామన్నారు. శనివారం ఆసుపత్రిని పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. రోగులు, వారి సహాయకులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ విభాగంలో సర్వర్ లోపం కారణంగా కొంచెం ఆలస్యం అవుతుందని, సరిచేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు తెలిపారు. ఆవరణలో జరుగుతున్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్కానింగ్ యంత్రాలు అందుబాటులో లేవు. అత్యవసర వైద్యంపై దృష్టి పెట్టామన్నారు. ముందుగా కాలువ వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తొలగింపు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. పుష్కరాల రేవు వద్ద నుంచి రోడ్డు ఆక్రమణలను తొలగించారు. దీనిలో భాగంగా రోడ్డు, కాలువలపై నిర్మాణాలు తొలగిస్తున్నారు. శనివారం పేపరుమిల్లు రోడ్డు పక్కల ప్రాంతాల్లో ఆక్రమణలను జేసీబీలతో తొలగించారు. కొన్ని చోట్ల రాజకీయంగా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో పూర్తిస్థాయిలో తొలగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం.

సీఎంను కలిసిన ఆదిరెడ్డి



టి.నగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు.

డిగ్రీ కళాశాలలో పద్య పోటీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. సంస్కృత శాఖాధిపతి ప్రభల శ్రీలక్ష్మి, తెలుగు శాఖాధిపతి కుసుమ కుమారి నిర్వహణలో పద్యపఠన పోటీలు జరిగాయి. విజేతలకు వైస్ ప్రిన్సిపల్ కె.ఎస్.రత్నకుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రతిభకు పురస్కారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గోవాలో జరిగిన యంగ్ ఆర్కిటెక్ట్స్ ఫెస్టివల్ 2024లో రాజమహేంద్రవరం నగరానికి చెందిన వేదుల షణ్ముఖ తేజకు యంగ్ ఆర్కిటెక్ట్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో తనకు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు అందించారని షణ్ముఖ తేజ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఏ.వి.ఏ రోడ్డు: రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యంలో నామవరంలోని అమ్మనాన్న వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వృద్ధులకు, సిబ్బందికి గుండె పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు.

క్రీడా కోర్టులో నువ్వా.. నేనా..

దానవాయి పేట, న్యూస్‌టుడే: కేసులు, వాయిదాలు, తీర్పులు, శిక్షలు, సాక్ష్యాలు, నోటీసులు ఇలా నిత్యం రద్దీగా ఉండే జిల్లా కోర్టు ఆవరణలో శనివారం సందడి వాతావరణం నెలకొంది. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు రాజమహేంద్రవరం వేదికైంది. ఈ తరుణంలో అసోసియేషన్ కార్యాలయం, స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో బ్యాడ్మింటన్, చదరంగం పోటీల్లో న్యాయవాదులు ఉత్సాహంగా కనిపించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు, కడప, విశాఖ, శ్రీకాకుళం తదితర జిల్లాల బార్ అసోసియేషన్ల నుంచి న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అసోసియేషన్ సభ్యులు అభిప్రాయపడ్డారు. మహిళా న్యాయవాదులు కూడా ఆసక్తిగా పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ముఖ్యఅతిథిగా పోటీలు ప్రారంభించి, కొంత సేపు షటిల్ ఆడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో విజేతలను ప్రకటిస్తామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న న్యాయవాదులు



చదరంగం ఆడుతూ..

ఆటవిడుపుగా ఉంది..

న్యాయస్థానాల్లోని కేసులు, విచారణలు, వాయిదాలు, సాక్ష్యాలు తదితర అంశాలతో నిత్యం ఒత్తిడితో గడుపుతూ ఉంటాం. అది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రెండు రోజుల పాటు క్రీడలు నిర్వహించడం ఎంతో సరదాగా ఉంది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారితో పాల్గొనడంతో ఆటవిడుపుగా ఉంది. న్యాయస్థానాల్లో ప్రత్యర్థులుగా వాద, ప్రతివాదనలు మాదిరిగానే ఆటల్లో ఆధిపత్యం సాగించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- ధర్నలకోట వెంకటేశ్వరరావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ

ఒత్తిడి దూరం..

అన్ని రంగాల్లోనూ ఒత్తిడి వాతావరణం ఉంది. న్యాయవాద వృత్తిలో ఈ సమస్య ఇంకొంచెం ఎక్కువే. కొత్తవారిని కలుసుకోవడం, వారితో మాట్లాడటం, ఆడటంతో ఒత్తిడి తగ్గించుకోవచ్చు. ఇందులో పలు జిల్లాల బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఆటలు బాగా ఆడేవారితో పాటు మొదటిసారి ఆడుతున్న వారు.. అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుంది. ఆదివారం సాయంత్రం విజేతలను ప్రకటించి బహుమతులు అందజేస్తాం.

- కాశీ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి

అజరామర రచనలు

దేవీచౌక్: ప్రముఖ కవి గుర్రం జాషువా రచనలు అజరామరం అని వక్తలు కొనియాడారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం జాషువా జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, తెలుగు శాఖాధిపతి బి.సుబ్బలక్ష్మి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ ప్రేమకుమారి, డి.రాజు, కె.ఎం.సౌందర్యవతి, డాక్టర్ ప్రిస్కిల్ల పాల్గొన్నారు.

కులమతాలకు అతీతం గుర్రం జాషువా

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కుల మతాలకు అతీతంగా మహాకవి గుర్రం జాషువా నిలిచారని కళాగౌతమి వ్యవస్థాపకుడు బి.వి.ఎస్.మూర్తి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జాషువా జయంతి శనివారం నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ హిందువుల కావ్య రచనలోని గొప్పదనాన్ని తెలుపుతూ కొందరిలో ఉన్న కులమత భేదాలను నిరసించారన్నారు. ప్రతిమల పెండ్లి, నాలుగు పడగల హైందవ నాగరాజు వంటి పద్యాలు, పిరదౌసిలోని పద్యాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెనుగొండ జూనియర్ కళాశాల తెలుగు శాఖాధిపతి బాలచందర్ సాదే జాషువా పద్యాలను ఆలపించి వాటి అర్థం వివరించారు. కళాశాల అధ్యాపకురాలు బి.హెచ్.వి.రమాదేవి నిర్వహణలో బాలచందర్‌ను సత్కరించారు. ముంగండ సూర్యనారాయణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

★ శతాబ్దాల క్రితమే కుల వివక్షను ఎదుర్కొంటూ తెలుగు సాహిత్యంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి గుర్రం జాషువా అని బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి పేర్కొన్నారు. శనివారం బ్రౌన్ మందిరంలో జాషువా జయంతి నిర్వహించారు. విశ్రాంత ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లాది వెంకట రమణమూర్తి మాట్లాడుతూ మూఢాచారాలపై తిరగబడిన సాంఘిక విప్లవకారుడు జాషువా అన్నారు.

సాహసానికి ప్రతిరూపం భగత్‌సింగ్



రాజమహేంద్రవరం సాంస్కృతికం, వి.ఎల్.పురం: పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ పంజాబ్‌లో పుట్టిన భగత్ సింగ్ బ్రిటీష్ పాలకుల చెర నుంచి దేశాన్ని విడిపించేందుకు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. గువ్వల వెంకటేశ్వరరావు, నరవ గోపాలకృష్ణ, దేవత సుధాకర్, చల్లగాలి వెంకట రామరాజు, సిరికి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గానకోకిల లతామంగేష్కర్

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మధుర గాయని లతా మంగేష్కర్ 96వ జయంతి జిత్‌మోహన్‌మిత్రా కళావేదికపై జరిగింది. శనివారం గోకవరం బస్టాండ్ సమీపంలోని వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో లతామంగేష్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్రా మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన లతామంగేష్కర్ సంగీతంపై ఆసక్తితో కృషి, పట్టుదలతో చిత్రసీమలో రాణించారన్నారు. 30 ఏళ్లుగా ఆర్కెస్ట్రాలో తబలా కళాకారుడిగా సేవలందించిన వడ్డాది నాగేంద్రకు లతామంగేష్కర్ పురస్కారంతో సత్కరించారు. గాయనీ గాయకులు డాక్టర్ వంక బాలకృష్ణ, నళిని, డాక్టర్ హరి, గుంటూరి శ్రీనివాస్ తదితరులు గీతాలు ఆలపించారు. డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, గుమ్మడి సమర్పణరావు, పి.వి.ఎస్.కృష్ణారావు, వి.జగపతి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడా.. హక్కులు తెలుసుకో

దానవాయిపేట(రాజమహేంద్రవరం): వినియోగదారులు వారి హక్కులు పొందాలంటే వాటిపై అవగాహన ముఖ్యమని జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైజంక్షన్ రైతుబజార్‌లో కన్జ్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన నిర్వహించారు. వినియోగదారులకు మేలు చేసే చట్టాలున్నాయన్నారు. నష్టపరిహారం, సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్‌సీహెచ్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు డి.వెంకటేశ్వరరావు సూచనలు చేశారు. రైతుబజార్‌లో సబ్సిడీపై అందిస్తున్న కందిపప్పు పరిశీలించారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు. అంబేడ్కర్ రాజమహేంద్రవరం విచ్చేసిన రోజును పురస్కరించుకొని శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్రిటీషు కౌన్సిల్ మెంబరుగా అంబేడ్కర్‌ను నియమించిన తర్వాత రాష్ట్ర పర్యటనలో భాగంగా 1994లో సెప్టెంబరు 28న ఆయన రాజమహేంద్రవరంను సందర్శించారన్నారు. అదే సమయంలో పౌర సన్మానం జరిగిందన్నారు. గుర్రం జాషువా చిత్రపటానికి నివాళి అర్పించారు. కోటిలింగాలపేటలో అయిదేళ్లు జాషువా నివసించారన్నారు. సుబ్బారావు పేటలోని ఆనంద నిలయంలో అనాథ బాలల హాస్టల్‌కు మున్సిపల్ ఉద్యోగులు 10 సీలింగ్ ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లు, అందజేశారు. అంబేడ్కర్‌ను కలిసిన తాడేపల్లి గణేశ్వరరావు(90)ను సత్కరించారు. వెయిటు లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపుతున్న కారంగి హేమశ్రీ, కారంగి తరంగిణిలను సత్కరించి, నగదు అందించారు.

కార్యకర్తలే పార్టీకి పునాది: మాజీ మంత్రి వేణు

వి.ఎల్.పురం: కార్యకర్తలే పార్టీకి పునాది అని, దాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వైకాపా జిల్లా నూతన అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం నగరంలోని ఆనంద్ రీజెన్సీ పందిరి ఫంక్షన్ హాలులో ఆయన పదవీబాధ్యతల స్వీకరణ మహోత్సవం పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, శ్రీనివాస్‌నాయుడు తదితరులు మాట్లాడారు. అనంతరం మూడు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు.



నూతన కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మున్సిపల్ స్టేడియం నాగుల చెరువు లక్ష్మీగణపతి ఆలయం వద్ద మార్కెట్ పెద్దల సమక్షంలో శనివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నాగుల చెరువు మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా కోళ్ల కృష్ణచైతన్య, ఉపాధ్యక్షుడిగా కల్లి నరేష్‌రెడ్డి, కార్యదర్శిగా బి.నాగబాబు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సతీష్ కుమార్, కోశాధికారిగా బూర నీలకంఠం, మొల్లి సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.అప్పారావు, సభ్యులుగా గీసాల శ్రీనివాస్, దమ్ము వాసు, జుత్తిక ఉమామహేశ్వరరావు, మరుకుర్తి సుబ్బు, నరాల శెట్టిపండు, పప్పల పండ్లు, నైదాని గణేష్, జుత్తిక రాధ ఎన్నికయ్యారని కమిటీ సభ్యులు ప్రకటించారు.

తిరుమల వెళ్లకుండా ఆపలేదు: ఎమ్మెల్యే

టి.నగర్, న్యూస్‌టుడే: జగన్‌ను తిరుమల వెళ్లకుండా ఎవరూ ఆపలేదని, డిక్లరేషన్‌పై సంతకం చేయలేక ఆయనే కార్యక్రమం రద్దు చేసుకున్నారని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అయిదేళ్లలో సతీసమేతంగా వెళ్లి పట్టు వస్త్రాలు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించారు. లడ్డూ ప్రసాదం నాణ్యతను చెడగొట్టారన్నారు. తన మతం మానవత్వం అని జగన్ చెబుతున్నారని.. వివేకానంద రెడ్డి కుమార్తె సునీత విషయంలో ఆ మానవత్వం ఎక్కడికి పోయిందన్నారు. తిరుమల దర్శనానికి మాజీ మంత్రి రోజా డబ్బులు వసూలు చేశారన్నారు. వర్తకుల శ్రేయస్సుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గం ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేశామన్నారు.

కోటగుమ్మం: అంబేడ్కర్ రాజమహేంద్రవరం రావడం గర్వకారణని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. శనివారం అంబేడ్కర్ నగరానికి విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దారా యేసురత్నం, తాళ్లూరి విజయ్‌కుమార్, కప్పల వెలుగుకుమారి, కోసూరి చండీప్రియ, మొకమాటి సత్యనారాయణ, తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఛాంబర్ సభ్యులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా భరత్‌రామ్

వి.ఎల్.పురం: వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు శనివారం నగర వైకాపా కార్యాలయ వర్గాలు తెలిపాయి. ★ దేవుడిని రాజకీయాల్లోకి తీసుకురావడం దురదృష్టకరమని మాజీ ఎంపీ భరత్‌రామ్ అన్నారు. అధికారపక్ష నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని శనివారం దేవీచౌక్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు చేశారు.

స్వచ్ఛతా హీ సేవా

ఏ.వి.ఏ రోడ్డు: కలెక్టర్ ఆదేశానుసారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లక్ష్మీ సూర్యప్రభ, ఆర్ఎంవో డా.ప్రణవ్, మెప్మా డీపీఎం కె.మోహన్, రవిశంకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అరుణ, సుధారాణి, 150 మంది ఆర్పీలు పాల్గొన్నారు.

పచ్చదనంపై నిర్లక్ష్యపు వేటు



జాంపేట వద్ద నరికేసిన చెట్టు

–న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

చెట్టు నరికేయడం క్షణాల్లో పని.. కాని ఓ మొక్క చెట్టుగా పెరగడానికి ఏళ్ల సమయం పడుతుంది. నగరంలో కొన్ని వృక్షాలను విద్యుత్తుశాఖ సిబ్బంది నరికేయడంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానవాయిపేట, గోరక్షణపేట, జాంపేట, తాడితోట బైపాస్ రోడ్డు, తిలక్‌రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డుకు ఆనుకుని ఉన్న పలు వీధుల్లోనూ, శ్యామలానగర్, వీఎల్‌పురం, మోడల్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా గతంలో మొక్కలు నాటారు. వీటి రక్షణకు పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులు కృషి చేశారు. ఇప్పుడవి పెరిగి బాటసారులకు నీడనిస్తున్నాయి. అలాంటి చెట్లను విద్యుత్తు శాఖ సిబ్బంది విచక్షణా రహితంగా పడగొడుతున్నారు. సాధారణంగా విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని, ప్రమాదాలకు అవకాశం ఉందని అంటే కొమ్మలు మాత్రమే నరకాలి. అలాంటిది మొత్తం చెట్టునే నరికేస్తున్నారు. అదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాల సమయంలో ప్రమాదాలకు అవకాశం ఉందని, తొలగిస్తున్నామని చెప్పడం గమనార్హం. నగరంలో అసలే పచ్చదనం తగ్గిపోతుందని, దాని బదులు చెట్ల మధ్యగా వెళ్లే తీగలకు ప్లాస్టిక్ గొట్టాలు ఏర్పాటు చేయడంపై ఆలోచించాలని పలువురు కోరుతున్నారు.

మోడులే మిగిలాయి..



ఇంటి ప్రహరీ పక్కన నాటిన చెట్లు బాగా పెరిగాయి. వాటిని కొడుతుంటే బాధనిపించింది. తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలు నరికితే సరిపోయేది. మొదలు ఉంచి, పైభాగం మొత్తం నరికేస్తున్నారు. ప్రస్తుతం మోడులే మిగిలాయి.

– ఎన్.శ్రీధర్‌రాజు, దానవాయిపేట

ఎందుకు నాటామా అనిపించింది



స్వచ్ఛంద సంస్థల సహకారంతో జాగ్రత్తగా పెంచుతున్నాం. వేసవిలో చాలామంది ఇక్కడ సేదతీరుతుంటారు. సిబ్బంది తొలగిస్తుంటే ఎందుకు నాటామా అనిపించింది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– కె.రాజు, గోరక్షణపేట

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి



నూతన ఈవో సత్యనారాయణకు కండువా వేస్తున్న అచ్చన్నదొర

తంటికొండ దేవస్థానం ఈవోగా వడ్డాది సత్యనారాయణ

గోకవరం, న్యూస్‌టుడే: తంటికొండలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం ఈవోగా వడ్డాది సత్యనారాయణ నియమితులయ్యారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన గండి లక్ష్మీకుమార్ కోరుకొండ మిరియాలవారి సత్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శనివారం సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర ఆయనకు కండువా కప్పి స్వాగతం పలికారు.

30న తిరుమల ధర్మ పరిరక్షణ శోభాయాత్ర

కోరుకొండ, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఈ నెల 30న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో తిరుమల ధర్మ పరిరక్షణ శోభాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి సంప్రోక్షణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గాదరాడలో శనివారం ఎమ్మెల్యే, సతీమణి వెంకటలక్ష్మి దంపతులు గణపతి, నవగ్రహ, శత్రు సంహార, ధన్వంతరి హోమాలు చేపట్టారు.

హిందువులు సమైక్యంగా పోరాడాలి

గోకవరం, కడియం: హిందూ ధర్మానికి నష్టం కలిగిన రోజున హిందువులంతా సమైఖ్యంగా పోరాడాలని సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా అన్నారు. పార్టీలకు అతీతంగా మహిళలతో శనివారం తంటికొండ దేవస్థానంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ● లడ్డూ అపవిత్రతకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు వెలుగుబంటి రఘురామ్, ముద్రగడ జెమీ, వీరబాబు డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

బోర్డు మార్చారు



బొమ్మూరు, న్యూస్‌టుడే: కాతేరు పార్కు వద్ద చెత్త తొలగించి గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న స్వచ్ఛత బోర్డు పెట్టారు. దీనిపై ఈనాడులో 'ప్రభుత్వం మారినా బోర్డు మారలే' శీర్షికన శనివారం వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన కార్యదర్శి హనుమంతరావు సిబ్బంది ద్వారా బోర్డు తొలగించారు. దానికి బదులు కాతేరు గ్రామ పంచాయతీ వారి హెచ్చరిక బోర్డు పెట్టారు.

నీటి వృథా ఆగింది

బొమ్మూరు టిడ్కో గృహ సముదాయాల సమీపంలో పైపు నుంచి తాగు నీరు వృథాగా పోతుంది. ఈ సమస్యపై 'నీటి వృథా తీరని వ్యథ' శీర్షికన శనివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి సూర్యనారాయణ పైపునకు మరమ్మతులు చేయించి నీటి వృథా నియంత్రించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

దాతల దాతృత్వం.. ప్రయాణికులకు వరం

సేవ

కోరుకొండ, న్యూస్‌టుడే: దాతలు ముందుకు వచ్చి ఆదుకోవడంతో సమాజంలో నివసిస్తున్న ఎంతో మందికి మేలు చేకూరుతుంది. కోరుకొండ నుంచి రాజమహేంద్రవరం ప్రధాన రహదారిలో ప్రయాణికుల విశ్రాంతి కోసం పలు బస్ షెల్టర్లు నిర్మించడంలో ముందుకు వచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

బూరుగుపూడిలో..

బూరుగుపూడి ప్రధాన రహదారిలో అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బస్టాప్ వద్ద కేజేఆర్ ఫార్మసీ కళాశాల వారు ఒక బస్ షెల్టరును ఏర్పాటు చేశారు. తాజాగా పలు రకాల రంగులు వేసి తీర్చిదిద్దారు.

పలుచోట్ల బస్ షెల్టర్ల నిర్మాణం

మధురపూడి ప్రధాన రహదారిలో..

మధురపూడి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన ప్రయాణికుల విశ్రాంతి షెల్టరు అటు రాజమహేంద్రవరం, ఇటు కోరుకొండ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఉపయోగపడుతుంది. బయ్యే వెంకన్న, వెంకాయమ్మ వారి పేరుతో వారి కుటుంబ సభ్యులు ఈ షెల్టరును నిర్మాణం చేశారు.

కూడలి వద్ద..

మధురపూడి ప్రధాన కూడలి వద్ద రహదారిలో మేడిశెట్టి కొండలరావు, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం బస్ షెల్టరును ఏర్పాటు చేశారు.



బూరుగుపూడిలో కేజేఆర్ కళాశాల వారిచే బస్ షెల్టరు

అందరికీ ఉపయోగపడేలా..

నిడిగట్ల గ్రామానికి వెళ్లే రహదారిలో కూడలి వద్ద ప్రధాన రహదారి పక్కన రెండు బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. సమీపంలోని వికాస్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చి ప్రయాణికులకు, కళాశాలకు వచ్చి వెళ్లే విద్యార్థుల కోసం వీటిని ఏర్పాటు చేశారు.



కార్యక్రమంపై చిన్నారుల ప్రదర్శన

విద్యార్థులకు పోటీ పరీక్షలు

బిక్కవోలు: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో స్వర్ణాంధ్రప్రదేశ్, స్వచ్ఛ భారత్, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాలపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 138 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని ఎంఈవో-2 పూర్ణచంద్రరావు తెలిపారు.

కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

కోరుకొండ: కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా బీవీవీఎన్‌బీ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమడోలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ప్రసాద్ సీతానగరం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు.

రంగంపేట ఉపతహసీల్దారుగా రంజిత్‌కుమార్

రంగంపేట: రంగంపేట మండలం ఉప తహసీల్దారుగా యు.రంజిత్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జి తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దారు శశిధర్ బదిలీ అయ్యారు.

స్వర్ణ కిరీటం ఊరేగింపు

కోరుకొండ, న్యూస్‌టుడే: గోకవరం దేవీచౌక్‌లో కనకదుర్గమ్మ అమ్మవారికి సమర్పించనున్న స్వర్ణ కిరీటాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, కణుపూరు, గాదరాడ, శ్రీరంగపట్నం, కోటి, రాఘవపురం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం గ్రామాల్లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తలపై కిరీటాన్ని పెట్టుకుని ఊరేగించారు.

గిన్నిస్‌బుక్‌లో కొంకుదురు బాలికకు చోటు

బిక్కవోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొంకుదురుకు చెందిన కొవ్వూరి సాయి సాత్వికరెడ్డి 450 మంది బృందంతో కలిసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. విశాఖకు చెందిన మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు మాధవి సూర్యభట్ల నేతృత్వంలో వీరంతా ఊలు వస్త్రాలు, అల్లికలు చేస్తున్నారు. అందులో స్వాతికారెడ్డి కూడా చేరారు. ఆ సంస్థ గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 58,112 ఊలు వస్త్రాలను తయారు చేసి వాటిని పేదలు, అనాధ బాలలకు పంచారు. ఇందుకుగాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. స్వాతికారెడ్డి ప్రస్తుతం 5వ తరగతి చదువుతుంది.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రాంగణ సిబ్బంది

కుట్టుమిషన్ కిట్లు అందజేత

బొమ్మూరు, న్యూస్‌టుడే: కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మూరు మహిళా ప్రాంగణం ఇన్‌ఛార్జ్ జిల్లా మేనేజర్ నర్సమ్మ తెలిపారు. ప్రాంగణంలో శిక్షణకు వచ్చిన వారికి ప్రభుత్వం అందజేసిన కుట్టుమిషన్ కిట్టును శనివారం అందజేసామన్నారు. అందులో స్కేలు, టేపు, ఉక్స్, కలర్ సుద్దలు, సూది తదితర సామాగ్రి ఉందన్నారు. నెలరోజుల శిక్షణ అనంతరం ధ్రువపత్రం అంజేస్తామని శిక్షకురాలు అమరావతి తెలిపారు.

రైల్వేస్టేషన్ శుభ్రపరిచిన విద్యార్థులు

అనపర్తి గ్రామీణం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా అనపర్తి రైల్వే స్టేషన్‌లో జీబీఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. చెత్త ఊడ్చి స్టేషన్‌ను శుభ్రపరిచారు. స్టేషన్ సూపరింటెండెంట్ బాలశేఖర్, అధ్యాపకులు ఆనందరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చీపుర్లతో తుడుస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, రైల్వే అధికారులు

సమాజ హితం కోసం కలం పట్టిన వ్యక్తి విశ్వస్ఫూర్తి

రాజానగరం, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ సహాయాచార్యులు తరపట్ల సత్యనారాయణ కన్వీనర్‌గా తెలుగు జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. సమాజం హితం కోసం కలం పట్టిన వ్యక్తిగా, ఆధునిక విజ్ఞాన గురువుగా విశ్వస్ఫూర్తి నిలిచారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు గురు విశ్వస్ఫూర్తి రచనల గురించి తమ అభిప్రాయాలు న్యూస్‌టుడేతో పంచుకున్నారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన డా.పి.నల్లన్న 'మనిషి మారితే తప్ప సమాజం మారదన్నది గురు భావజాలమని, ఆయన రచనలన్నీ మనిషి చుట్టూ తిరుగుతాయని' అన్నారు. హైదరాబాద్, కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు సహాయాధ్యాపకులు డా.పి.విజయకుమార్ 'యువతలో మార్పు తీసుకురావాలంటే దిశానిర్దేశం చేసే దిక్సూచి ఉండాలి. అవి విశ్వస్ఫూర్తి రచనల్లో ఉంటాయని' అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం సహాయాచార్యులు డా.బూసి వెంకటస్వామి 'వ్యక్తి-వ్యక్తిత్వం ఈ రెండింటి మీద ఆయన లోతైన అధ్యయనం చేశారు. వ్యక్తి అంటే బతకటమని, వ్యక్తిత్వం అంటే జీవితమనే నిర్వచనం ఆయన తన రచనలద్వారా ఇచ్చారని' అన్నారు. సదస్సులో విశ్వస్ఫూర్తి రచనలు- ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం పేరుతో ప్రచురించిన పరిశోధనా పత్రాల గ్రంథాన్ని వీసీ ఆచార్య శ్రీనివాసరావు ఆవిష్కరించారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు, తదితరులు

తంటికొండ వీఏఏ అదృశ్యమయ్యారని ఫిర్యాదు

గోకవరం, న్యూస్‌టుడే: తంటికొండ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ)గా విధులు నిర్వహిస్తున్న గాలి దీప్తి స్వర్ణలత(26) అదృశ్యమయ్యారని శనివారం ఆమె తల్లి ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయకముందే ఆమె ఆచూకీ లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాలివీ.. గోకవరం గ్రామానికి చెందిన దీప్తి స్వర్ణలత తంటికొండ వీఏఏగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వర్షాలకు పంట నష్టం నమోదు సక్రమంగా జరగలేదంటూ రైతులు, స్థానిక నాయకులు శనివారం కార్యాలయం వద్దకు వెళ్లి ఆమెను ప్రశ్నించారు. అప్పటి నుంచి తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లి ప్రమీల పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఎస్సై పవన్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన గంటల వ్యవధిలోనే ఆమె ఆచూకీ దొరికిందన్నారు. ఆమెతో మాట్లాడామని, కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు.

విరుల్లో 'హరివిల్లు'



పచ్చని విరులతో మనసుకు ఆహ్లాదాన్ని అందించే మొక్కల మధ్య ఏడు రంగుల ఇంద్రధనుస్సు వాలి కనువిందు చేసింది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక నర్సరీల్లో ఈ దృశ్యం ప్రజలను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. చిరుతపులి మాట పక్కన పెట్టి ప్రకృతి రమణీయాన్ని తమ చరవాణీల్లో బంధించారు. - న్యూస్‌టుడే, కడియం

జాషువా, భగత్‌సింగ్‌లకు నివాళి

కడియం, న్యూస్‌టుడే: రచనలతో సమాజంలో చైతన్యదీప్తిని వెలిగించిన గుర్రం జాషువా, అలుపెరుగని ఉద్యమాలతో ఉరికొయ్యని సైతం ముద్దాడిన భగత్‌సింగ్ జయంతి వేడుకలు కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగాయి. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రఫీయుద్దీన్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, శరత్‌బాబు, గిరిజ, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

సమస్యల ఏకరవు

రాజానగరం: రాజానగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఏకరువు పెట్టారు. జడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న అధికారులకు, ప్రజాప్రతినిధులకు సంధానకర్తగా వ్యవహరించారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం

రాజానగరం: సమాజంలో ఎక్కడ ఉన్నా భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎంతో అవసరమని గైట్ అటానమస్ కళాశాల లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సహాయ ప్రొ.భాను ప్రకాష్ అన్నారు. దివాన్‌చెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భావవ్యక్తీకరణ నైపుణ్యంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

గృహ నిర్మాణాలకు ఇదే చివరి అవకాశం

కడియం, రంగంపేట: గృహనిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి రానున్న మార్చితో గడువు పూర్తికానుందని రాజమహేంద్రవరం డివిజన్ గృహ నిర్మాణ శాఖ ఈఈ జి.రాజగోపాల్ తెలిపారు. జేగురుపాడులోని శనివారం 'మన ఇల్లు-మన గౌరవం' పేరిట లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తొలిదశలో మంజూరైన 1,406 ఇళ్లకు 362 మాత్రమే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతా లబ్ధిదారులంతా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయకుంటే మంజూరైన స్థలం రద్దు చేస్తారన్నారు. ఆశాఖ డీఈ సత్యనారాయణ మూర్తి, ఏఈ శ్రీకాంత్, ఏపీఎం అప్పలకొండ, గ్రామకార్యదర్శి శిరీష పాల్గొన్నారు. ● రంగంపేట మండలంలోని చంద్రేడు, సుభద్రంపేటలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. గృహనిర్మాణ శాఖ డీఈ వేణుగోపాల్ వివరించారు.

అవీ ఇవీ అన్నీ

అక్టోబర్‌లో రైతు నేస్తం రుణం

కోరుకొండ: రైతు నేస్తం రుణాలను వచ్చే నెల నుంచి అందివ్వనున్నట్లు పీఏసీఎస్ అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కె.సుబ్బారావు తెలిపారు. శనివారం జరిగిన బూరుగుపూడి సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘ, స్వల్ప కాలిక రుణాల వివరాలు వెల్లడించారు. రూ.18 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ లాభాల బాటలో పయనిస్తోందన్నారు.

ఈలకొలనులో సామూహిక సీమంతాలు

రంగంపేట, బిక్కవోలు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఈలకొలనులో, బిక్కవోలు మండలంలోని అరికిరేవులో సామూహిక సీమంతాలు నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు రాయుడు రాంబాబు, పీహెచ్‌సీ కమిటీ మాజీ అధ్యక్షుడు నీలపాల త్రిమూర్తులు, సర్పంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో వైకాపా నాయకుల పూజలు

అనపర్తి గ్రామీణం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అనపర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు శనివారం పూజలు నిర్వహించారు. అనపర్తి పాతవూరులోని సత్తిపోతారెడ్డి, తేతలిరామిరెడ్డి రామాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, రామవరంలోని వైకాపా నేత సబ్బెళ్ల కృష్ణారెడ్డి పార్టీశ్రేణులతో కలిసి పూజలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

అనపర్తి గ్రామీణం: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ అన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు.

రేబిస్ ఇంజక్షన్లు తీసుకోవాలి

సీతానగరం: ఇంట్లో పెంచుకునే కుక్కల తోపాటు, నివసించే వారంతా ముందస్తుగా యాంటీ రేబిస్ ఇంజక్షన్లు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యులు ఎన్.రాజు తెలిపారు. సీతానగరం పీహెచ్‌సీలో శనివారం 'వరల్డ్ రేబిస్ డే' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాణంతకమైన రేబిస్ వ్యాధి ఎక్కువగా కుక్కకాటు వల్ల వస్తోందన్నారు. ఎంపీహెచ్ఈవో వైఎస్.రాయుడు, ఆదిలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.

క్రీడావికాస కేంద్రం మరమ్మతులు

సీతానగరం: సీతానగరంలోని క్రీడావికాస కేంద్రంలో కాంక్రీట్, ఉడెన్ ఫ్లోరింగ్ పనులు వేగవంతంగా చేయిస్తున్నామని.. 20 రోజుల్లోనే పనులన్నీ ఒక కొలిక్కి వస్తాయని ర.భ.శాఖ ఏఈఈ జి.వీరన్నబాబు తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులతో కలిసి శనివారం క్రీడావికాస కేంద్రంలో పనులు పర్యవేక్షించారు.

గొలుసు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

అనపర్తి గ్రామీణం: ముందస్తు సమాచారం మేరకు అనపర్తి మండలం మహేంద్రవాడలో మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్న కర్రి నాగిరెడ్డిని అదుపులోకి తీసుకుని, 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీను నాయక్ శనివారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గుంతలతో గుబులు

దర్పణం

హుకుంపేట, న్యూస్‌టుడే: రహదారి చెంతనే ప్రమాదకరంగా గుంతలు ఉండటంతో ఇబ్బందికరంగా ఉందంటూ స్థానికులు వాపోతున్నారు. హుకుంపేట పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో మంచి నీటి వాల్వుకు సంబంధించిన గుంతలపై ఎటువంటి రక్షణ లేకుండా వదిలేశారంటున్నారు. దీని వలన రాత్రి సమయంలో వాహనాలు అదుపు తప్పి పడతాయోమో అని భయపడుతున్నారు. చిన్నారులు ఆటలాడే సమయంలో ఆదమరచి పడినట్లయితే ప్రాణాపాయ స్థితికి చేరతారని తరువాత చేసేదేమి లేదని అంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకట్రావుని వివరణ కోరగా సిబ్బందిని పంపిస్తామని మంచి నీటి వాల్వుకు సంబంధించిన గుంతలపై మూతలు ఏర్పాటు చేస్తామని, తవ్వి వదిలేసిన గుంతల్లో పైపులైనుకు మరమ్మతులు చేపట్టి పూడ్చే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.



హుకుంపేట ఎస్సీ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా..



కార్తికేయనగర్‌లో గొట్టాలు పగిలి నీటితో నిండిన గుంత

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

పరిశ్రమల సందర్శనతో విజ్ఞానం

ఉండ్రాజవరం: పరిశ్రమల సందర్శనతో విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని ప్రధానోపాధ్యాయిని బి.సూర్యాకాంతం అన్నారు. సత్యవాడ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థులను చివటంలోని స్పిన్నింగ్ పరిశ్రమను శనివారం సందర్శించారు. వివిధ విభాగాలు, ఉత్పత్తి ప్రక్రియ గురించి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వివరించారు. ఒకేషనల్ శిక్షకురాలు రెడ్డి దివ్యదుర్గ, పి.సత్యనారాయణ, జి.కుమారస్వామి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో కొలువైన భూ సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ శనివారం చేశారు. పలువురు భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వెలగదుర్రు, తాడిపర్రు, వేలివెన్ను, పాలంగిలో వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

క్షతగాత్రులకు రూ. లక్ష సాయం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న దాతలు

దేవరపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులకు చికిత్స నిమిత్తం రూ.1,01,100 ఆర్థిక సాయాన్ని దాతలు, జనసైనికులు అందజేశారు. త్యాజంపూడికి చెందిన ఈగల రవికుమార్-లోవలక్ష్మీ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామ దాతలు రూ.42,000, త్యాజంపూడి జనసేన పార్టీ ఆధ్వర్యంలో రూ.41,500, దేవరపల్లి జనసేన పార్టీ తరుపున రూ.17,600 నగదు బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్త తొలగించాలి

సమస్య: గౌతమినగర్ పరిధి ఫ్యాక్టరీ క్వార్టర్స్ రోడ్డు పొడవునా వీధుల వద్ద చెత్త పోగులు సకాలంలో తీయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.

– పీఎన్ సురేష్, స్థానికుడు

సమాధానం: చెత్తను సకాలంలో తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. డ్రెయిన్లలో వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పిస్తాం.

– నాగేంద్రకుమార్, కమిషనర్, కొవ్వూరు

- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

గుంతతో చింత

సమస్య: వడలి-ముక్కామల రోడ్డులో అల్లూరి సీతారామరాజు బొమ్మ కూడలిలో వద్ద విద్యుత్తు సంభం పక్కన పెద్ద గుంత ఉంది. దీనిని పూడ్చాలి.

– సత్యనారాయణ, స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలిస్తాం. సిబ్బందితో గుంతను పూడ్చేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, ఖండవల్లి కార్యదర్శి

- న్యూస్‌టుడే, పెరవలి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

బిల్లుల చెల్లింపులకు కూటమి కార్యాచరణ

ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్లో ఆనందం

గోపాలపురం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు చేపట్టింది. 2016-17లో వేలాది గృహాలు మంజూరు చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా అప్పట్లో నిర్మించుకున్న గృహాలకు బిల్లుల చెల్లింపులు నిలిపేసింది. లబ్ధిదారులు వైకాపా ప్రభుత్వ పాలనలో బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి లబ్ధిదారులందరికీ బిల్లులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఆ శాఖ అధికారులు బిల్లుల చెల్లింపునకు అవసరమైన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	లబ్ధిదారుల సంఖ్య
గోపాలపురం	333
దేవరపల్లి	166
నల్లజర్ల	105
చాగల్లు	688
కొవ్వూరు	737
తాళ్లపూడి	425
పెరవలి	204
ఉండ్రాజవరం	747
నిడదవోలు	777

ఆరా తీస్తున్న అధికారులు..

2016-17లో నిర్మించుకుని వైకాపా ఐదేళ్ల పాలనలో నిలిచిపోయిన గృహాల స్థితిగతులను ప్రస్తుతం ఆ శాఖాధికారులు సేకరిస్తున్నారు. ఐదేళ్లపాటు బిల్లులు నిలిచిపోవడంతో కొంతమంది అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. కొందరైతే సొమ్ములు లేక మధ్యలో నిర్మాణం నిలిపివేసి, అద్దె గృహాల్లో ఉంటున్నారు. వీరి ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకుంటోంది. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నివేదించాలని గృహ నిర్మాణ శాఖకు ప్రభుత్వం స్పష్టం చేసింది. గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 4,182 ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి పూర్తి చేసినవి ఎన్ని అన్నది గుర్తించి జియోట్యాగింగ్ చేస్తున్నారు. పనులు ప్రారంభించి బిల్లులు చెల్లించకుండా ఉన్నవి, కొంత సొమ్ములు వేసినవి, మధ్యలో మిగిలిన పోయిన వాటికి బిల్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.


ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుడి ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇంటింటి పరిశీలన..

ఎన్టీఆర్ గృహాలు నిర్మించిన పేదలకు బిల్లులు చెల్లింపులకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయి పరిశీలన చేసి లబ్ధిదారుల వివరాలు జియోట్యాగింగ్ చేస్తున్నాం. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే విడుదలైన బిల్లులు తొందరలో జమఅవుతాయి.

- డీఈ టి.శేఖర్‌బాబు, గోపాలపురం

విధుల్లోకి చేరిన అధికారులు

చాగల్లు: చాగల్లు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఇరువురు అధికారులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చిన టి.శ్రీనివాసరావు పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా, కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన ఎం.కమల్‌సుందర్ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

గోపాలపురం డీటీగా అజయ్

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా కె.అజయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొవ్వూరు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి తహసీల్దార్ పని చేసిన కె.ప్రదీప్ నిడదవోలు బదిలీపై వెళ్లారు.

సబ్ రిజిస్ట్రార్‌గా మోహనరావు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్‌గా మోహనరావు శనివారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈయన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్ మౌలానా మండపేటకు బదిలీ అయ్యారు. మోహనరావుకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

డిపో మేనేజర్ రామ్‌కుమార్‌కు సత్కారం

నిడదవోలు, న్యూస్‌టుడే: మైదుకూరుకు బదిలీ అయిన నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్‌ను శనివారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ★ నిడదవోలు సబ్ రిజిస్ట్రార్‌గా రాజబాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమహేంద్రవరం-1 నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చారు. ఆయనకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

దేవరపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు శనివారం భూమిపూజ చేశారు. యర్నగూడెం, సంగాయిగూడెం, గాంధీనగరం, చిన్నాయిగూడెం, యాదవోలు, బంధపురం, దుద్దుకూరు గ్రామాల్లో రూ.1.10 కోట్లతో మురుగుకాలువలు, రూ.65 లక్షలతో రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం యాదవోలులో సచివాలయాన్ని ప్రారంభించారు. దుద్దుకూరులో తెదేపా వీరాభిమాని కోమటి సూర్యారావు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెదేపా మండలాధ్యక్షుడు ఆండ్రు అనిల్, జనసేన ఇన్‌ఛార్జి సువర్ణరాజు, తహసీల్దార్ రాజ్యలక్ష్మీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ★ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలు వస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మద్దిపాటి సూచించారు. ఆదివారం ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లిలో గత మూడు రోజులుగా సుమంత్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. గుండె వైద్యుడు సుమంత్ ఆధ్వర్యంలో దంత విభాగాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 62 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందని నిత్యం ఏదోకచోట ప్రమాదం జరుగుతూనే ఉంటున్నాయని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రి ద్వారా రోగులకు సేవలందించాలన్నారు. జోధా ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ప్రజలకు వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు.


కాలువ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మద్దిపాటి

ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దాం


మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దాం-బాలికలను చదివిద్దామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం నిర్వహించిన బేటి బచావో - బేటి పడావో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను ఉత్తమ పౌరులుగా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బాలల అక్రమ రవాణా నివారణ బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. వారికి పోషకాహార కిట్లు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, పురపాలక సంఘ కమిషనర్ కృష్ణవేణి, తహసీల్దారు నాగరాజు నాయక్, ఐసీడీఎస్ పెరవలి ప్రాజెక్టు అధికారిణి శ్రీలక్ష్మి, కూటమి నాయకులు రంగా రమేష్, సూర్యారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరల పంపిణీ

నల్లజర్ల, న్యూస్‌టుడే: దోమలకాటు వల్ల అనేక వ్యాధులు సోకుతాయని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తెల్లం గంగాధరరావు అన్నారు. శనివారం నల్లజర్లలోని పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న కాలనీవాసులకు ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దోమల తెరలను పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులకు కారణమైన దోమల కాటు నుంచి రక్షణ కోసం తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇవాంజలిన్, ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ అధికారి పలివెల ప్రసాద్. జి.వి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలను దేదీప్యమానంగా నిర్వహించాలి


సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలను దేదీప్యమానంగా జరిపించేందుకు.. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణ అవలంబించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ కుక్కల స్వైర విహారంపై దృష్టి సారించాలని కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు సూచించారు. గోదావరి ఉపరితల నీటి పథకానికి స్థల సేకరణ, వినాయక నిమజ్జనాల ఏర్పాట్లకు వ్యయం, కాలనీలకు తాగునీటి ట్యాంకర్ల సరఫరా, వర్షాలతో పాడైన రహదారుల మరమ్మతులకు రూ.7.22 లక్షలు, తాత్కాలిక యార్డులోని చెత్తను వెనక్కి సర్దించడం, దుర్వాసన వెదజల్లకుండా రోడ్డుకిరువైపులా రక్షిత గోడ ఏర్పాటుకు రూ.4.35 లక్షలతో చేసిన ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదించింది. తెదేపా ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడారు.

రూ.1.50 కోట్ల నిధులు దక్కలేదు..

ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించనందున 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.1.50 కోట్లు పురపాలక సంఘానికి రాలేదని ఎమ్మెల్యే అన్నారు. ఛైర్‌పర్సన్ స్పందిస్తూ సచివాలయ సిబ్బంది అలసత్వం వల్ల ఆ నిధులకు అర్హత కోల్పోయామన్నారు. నిధులు రాని అంశాన్ని కమిషనర్ నాగేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా 2023-24 ఏడాదికి ఉన్న ఆస్తి పన్ను డిమాండ్, ఆ తర్వాత ఏడాదికి 12.01 శాతం పెరగాల్సి ఉందన్నారు.

నగదు, బంగారం చోరీపై కేసు

కొవ్వూరు పట్టణం: నగదు, బంగారం చోరీ జరిగిన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 21న గౌతమినగర్‌కు చెందిన మిద్దే భాగ్యలక్ష్మి, ఆమె భర్త ఇంట్లో వేర్వేరు గదుల్లో నిద్రిస్తున్నారు. అలికిడి అవ్వడంతో భర్త లేచి చూడగా గుర్తు తెలియని ఓ వ్యక్తి ఇంట్లో నుంచి పారిపోతున్నాడు. చరవాణి, రూ.5 వేలు, కాసు బంగారు మంగళ సూత్రాలు, ఒక గ్రాము రూపు, ద్విచక్ర వాహన తాళాలు పోయినట్లు గుర్తించారు. దీనిపై భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

కొవ్వూరు పట్టణం: పట్టణ పరిధి అనంగపాల్ వీధిలో తుమ్మలపల్లి శ్రీదేవి ఈ నెల 22వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త చనిపోవడంతో శ్రీదేవికి మానసిక స్థితి సరిగా లేదని, ఆ నేపథ్యంలో ఇంట్లోంచి వెళ్లి మళ్లీ వస్తుంటారని, అయితే వారం దాటినా తిరిగి రాలేదని ఆమె కమార్తె విజయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కనపడటంలేదంటూ..

పెరవలి: తన ఇద్దరు పిల్లలు, భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పెరవలి ఎస్సై అప్పారావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముక్కాముల గ్రామానికి చెందిన వనచర్ల రాముడు భార్య రాణి తమ ఇద్దరి పిల్లల్ని తీసుకుని రెండు రోజుల కిందట అజ్జరంలో తన పుట్టింటికి బయలుదేరింది. కాని అక్కడికి చేరుకోలేదు. వారి అచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తాళ్లపూడి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకునానరు. తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోకి ప్రక్కిలంక ట్యాక్సీ సెంటర్ వద్ద గజ్జరం గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు అధిక ధరకు మద్యం అమ్ముతుండగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద గోనే సంచిలో ఉన్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

కాలువ వద్ద అనుమానాస్పదంగా వాహనం

చాగల్లు: చాగల్లు గ్రామ శివారు పేముల కాలువ వంతెన వద్ద ద్విచక్ర వాహనంతోపాటు చెప్పులు, చరవాణి వదిలి వెళ్లిపోవడంతో పోలీసులు శనివారం దర్యాప్తు చేపట్టారు. ఇది గ్రామానికి చెందిన ఇమ్రాన్‌కు చెందినదిగా గుర్తించామని ఎస్సై నరేంద్ర తెలిపారు. ఇమ్రాన్ కోసం గాలింపు చేపడుతున్నామన్నారు.

పాపాల నుంచి కాపాడాలంటూ క్షీరాభిషేకాలా?

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసి.. ఆ పాపాల నుంచి కాపాడాలంటూ వైకాపా నాయకులు క్షీరాభిషేకాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమల వేంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చి దర్శనం చేసుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి ఏమాత్రం ఇష్టం లేదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నపుడు తానెప్పుడూ సంతకం చేయలేదని వితండవాదం చేస్తున్నారన్నారు. అన్యమతస్థులు తిరుమల వస్తే డిక్లరేషన్‌పై సంతకం చేయడం సంప్రదాయం, నిబంధనగా వస్తోందన్నారు. జగన్ తిరుమల వెళ్లడం ఇష్టం లేక ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు.

ఆలయ శుద్ధిలో తెదేపా శ్రేణులు

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్లలోని వరసిద్ధి వినాయకుని ఆలయాన్ని వైకాపా శ్రేణులు అపవిత్రం చేశారంటూ కూటమి శ్రేణులు ఆలయాన్ని పసుపునీళ్లతో కడిగారు. శనివారం ఉదయం వైకాపా శ్రేణులు వరసిద్ధి వినాయకుని ఆలయానికి చేరుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని పూజలు చేశారు. కాసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న కూటమి శ్రేణులు నిరసన తెలియచేసి అనంతరం పసుపు నీళ్లతో ఆలయాన్ని కడిగి చేసి వినాయకుడికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జగన్ ఫొటోలను దహనం చేశారు. నిరసనలో తెదేపా సీనియర్ నాయకుడు వల్లూరి సత్తిపండు, చింతా చైతన్య, కోడూరి నారాయణ, రావూరి వెంకట రమణ, సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘లడ్డూ కల్తీ ఆరోపణలు సరికాదు’


ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న వైకాపా ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు, నాయకులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తిరుమల లడ్డూ కల్తీ అంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని.. కూటమి ప్రభుత్వానికి భగవంతుడు మంచి బుద్ధి ప్రసాదించాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. పాప ప్రక్షాళన పేరుతో కొవ్వూరు పట్టణంలోని బసివిరెడ్డిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి 108 కొబ్బరి కాయలు కొట్టారు.

దేవరపల్లి, గోపాలపురం: లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని కొన్ని రాజకీయ పార్టీలు వితండవాదం చేయడం సరికాదని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని వైకాపా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పలు ఆలయాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పూజలు, అభిషేకాలు శనివారం నిర్వహించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్దన్‌రావు, సాదే సుబ్బారావు, వెలగా శ్రీరామూర్తి, పచ్చా రామ్ గోపాల్, దుగ్గిన గంగాధర్ పాల్గొన్నారు.

సాహిత్యంలో మహోన్నత శిఖరం జాషువా

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో కుల వివక్షను రూపుమాపడంలో జాషువా రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గుర్రం జాషువా 129వ జయంతిని ఎల్ఐసీ కార్యాలయ కూడలిలోని విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పెనుమాక జయరాజు, నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సాహిత్యంలో మహోన్నత శిఖరమైన జాషువా యువతరానికి ఆదర్శమన్నారు. కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, ఎం.రామచంద్రరావు, మద్దిపాటి సత్యనారాయణ, ముప్పిడి రాజు, గెల్లా కేశవ, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, సంస్కృత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


గుర్రం జాషువా విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, నాయకులు

నిడదవోలు: ఆధునిక సాహిత్యంలో తనకంటూ స్థానం సంపాదించుకున్న రచయిత గుర్రం జాషువా అని స్థానిక ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు పి.ఉషారాణి అన్నారు. వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డా. కంబయ్య, అధ్యాపకులు డా.జానకీదేవి, డా. లావణ్య, శోభారాణి, శ్రీలక్ష్మిభ్రమరాంబ, సోనీ, ఇందిరా పాల్గొన్నారు.

పెరవలిలో స్వచ్ఛభారత్

పెరవలి: పెరవలిలో స్వచ్ఛభారత్ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా రోడ్లను, కాలువను శుభ్రం చేశారు. పెరవలి మండలం కొత్తపల్లిలో ఆర్యవైశ్య సేవాసంస్థ, ఇతర స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. ఇంటింటా తిరిగి మహిళలకు బొట్టుపెట్టి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓలేటి నారాయణకుమార్, గుడివాడ బాలకృష్ణ, శ్రీహరి, రామాంజనేయులు, సత్యనారాయణ, ఉదయభాస్కరరావు, మురళీకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో యువతికి జీవిత ఖైదు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడిచేసిన కేసులో ఓ యువతికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలగపూరి నాగేశ్వరరావు తెలిపిన ప్రకారం.. ఏపీలోని నల్లజర్ల మండలం పుల్లపాడు గ్రామానికి చెందిన గడ్డం వసుంధరా లక్ష్మీ(20) పదేళ్ల క్రితం నగరానికి వలసొచ్చింది. 2016లో చందానగర్ పరిధి నల్లగండ్లలో ఉన్న లక్ష్మీ విహార్‌లోని ఓ విల్లాలో పనిచేసేది. పక్కింటి విల్లాలో మన్నెం శ్రీనివాస్ కుటుంబం ఉండేది. దంపతులు ఉద్యోగానికి, కుమారుడు కళాశాలకు ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేవారు. శ్రీనివాస్ తల్లి ఉమాదేవి(69) ఇంట్లో ఉండేది. గమనించిన వసుంధరా లక్ష్మీ ఆమె ఒంటిపై నగలు దోచుకెళ్లాలని కుట్రపన్నింది. 9.9.2016న మధ్యాహ్నం వారి ఇంట్లోకి చొరబడింది. ఉమాదేవి ఒంటిపై నగలను లాక్కుంటుండగా ఆమె కేకలు వేసింది. దీంతో కత్తితో పొడిచి నగలు లాక్కుంది. ఉమాదేవి మరింత గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు ఇంటి ముందు గుమిగూడారు. వసుంధరా లక్ష్మీకి పారిపోయే అవకాశం లేకపోవడంతో కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఉమాదేవితోపాటు వసుంధరా లక్ష్మీని ఆసుపత్రికి తరలించగా.. ఉమాదేవి చనిపోయింది. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి 6వ అదనపు జిల్లా జడ్జి సి.పావని 15మంది సాక్షులను విచారించి శనివారం తీర్పునిచ్చారు. నిందితురాలికి యావజ్జీవ ఖైదుతోపాటు ఇంట్లోకి చొరబడడం.. నగలు లాక్కోవడంపై 7, 2 ఏళ్ల కారాగార శిక్ష విధించారు.

భగత్‌సింగ్‌కు నివాళులు

పెరవలి: మండలంలోని తీపర్రులో భగత్‌సింగ్ జయంతి వేడుకలను అబ్దుల్ కలాం సేవా సమితి నాయకుడు కోడూరి రాఘవేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రంతో ఉన్న నాణేలను పలువురికి పంచిపెట్టారు.

మలకపల్లిలో నేత్రదానం

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలో చెరుకూరి రామలక్ష్మి(87) శనివారం మృతి చెందారు. నేత్రాలను దానం చేయడం ఆమె కోరిక అని కుటుంబ సభ్యులు తెలపడంతో వాటిని సేకరించేందుకు నిడదవోలు నుంచి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్ నేత్ర వైద్యశాల నుంచి వైద్యులు వచ్చారు. తాళ్లపూడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు ఆమె కార్నియాలను సేకరించారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ఉండ్రాజవరం: రైతులు కోరుకున్న మిల్లులకే ధాన్యం తరలించాలని తహసీల్దార్ ప్రసాదు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సార్వా పంట ధాన్యం కొనుగోలుపై ఆయా శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, ఎం.విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన ఇల్లూ- మన గౌరవం

తాళ్లపూడి: ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని ఎంపీడీవో రమణ తెలిపారు. మండలంలోని ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల వద్ద మన ఇల్లూ-మన గౌరవం కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

నూతన భవన నిర్మాణానికి తీర్మానం

ఉండ్రాజవరం: తాడిపర్రు సహకార సంఘం నూతన భవన సముదాయాన్ని నిర్మించటానికి తీర్మాణం చేసినట్లు సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు అన్నారు. ఆ సొసైటీ మహాజనసభను శనివారం నిర్వహించారు. సొసైటీ 9 సెంట్ల స్థలంలో భవన సముదాయాన్ని నిర్మించటానికి సర్పంచి నరేంద్రబాబు పంచాయతీ తీర్మానం పత్రాన్ని ఆయనకు అందజేశారు.